6 నుంచి యూజీసీ నెట్ పరీక్షలు

న్యూఢిల్లీ, నవంబర్ 17: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ నెట్) పరీక్ష షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) శుక్రవారం విడుదల చేసింది. ఈ పరీక్షలను డిసెంబర్ 6, 7, 8, 11, 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తారు. రెండు పేపర్లుగా కంప్యూటర్ ఆధారిత విధానంలో(సీబీటీ) నిర్వహించే ఈ పరీక్షల్లో అబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలకు 10 రోజుల ముందు ఎగ్జామ్ సెంటర్ సమాచారాన్ని జారీ చేస్తామని, ugcnet.nta.ac.in లేదా nta.ac.in వెబ్‌సైట్‌లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్టీఏ పేర్కొన్నది. అడ్మిట్ కార్డులను డిసెంబర్ మొదటి వారంలో విడుదల చేస్తామని తెలిపింది. భారత యూనివర్సిటీలు, కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అభ్యర్థుల అర్హతను నిర్ధారించేందుకు ఎన్టీఏ ఈ పరీక్ష నిర్వహిస్తుంది. ఈ ఏడాది జూలైలో జరిగిన మొదటి ఎడిషన్‌లో 83 సబ్జెక్ట్‌లకు దేశవ్యాప్తంగా 181 పట్టణాల్లో యూజీసీ నెట్ పరీక్ష నిర్వహించారు.

రాజీనామానా? జైలు నుంచే పాలనా?

న్యూఢిల్లీ: 'ఒకవేళ ఢిల్లీ మద్యం పాలసీ కేసులో నన్ను అరెస్ట్ చేస్తే సీఎం పదవికి రాజీనామా చేయాలా? లేదా జైలు నుంచే పాలన సాగించాలా?' అని తన పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలను ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రశ్నించారు. శుక్రవారం వారితో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అధికారం చేపట్టిన 49వ రోజునే పదవికి రాజీనామా చేశానని, తనకు పదవీ కాంక్ష లేదని అన్నారు. అయితే బీజేపీ పన్నిన కుట్రలు, కుతంత్రాలకు చిక్కకూడదని భావిస్తున్నానని, ఈ విషయంలో నేతలు ఢిల్లీ ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. తనను జైలుకు పంపినా.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఢిల్లీలో ఒక్క సీటు కూడా గెల్చుకోలేదని చెప్పారు.

వాయుగుండం తీవ్రరూపం

రాష్ట్రంలో పొడి వాతావరణం

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్రరూపం దాల్చినట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని చెప్పారు. తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించారు. శనివారం వాయుగుండం బంగ్లాదేశ్‌లోని ఖేపుపారమొంగ్లా మధ్య తీరం దాటే అవకాశం ఉన్నట్టు తెలిపారు. రాష్ట్రంలో మరో 48 గంటలపాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో మబ్బులతో కూడిన వాతావరణం, జల్లులు పడే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఉత్తర తెలంగాణను చలి వణికిస్తున్నది.

హర్యానాలో ప్రైవేట్ రంగంలో '75%' కోటా కొట్టివేత

న్యూఢిల్లీ: ప్రైవేటు రంగం ఉద్యోగాల్లో స్థానికులకు 75 శాతం కోటాను తప్పనిసరి చేస్తూ హర్యానా ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని పంజాబ్-హర్యానా హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదిగా న్యాయస్థానం పేర్కొన్నది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మనోహర్‌లాల్ ఖట్టర్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ఇది గట్టి ఎదురుదెబ్బ అని చెప్పవచ్చు. ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లును 2020లో అసెంబ్లీలో ఆమోదించారు.

ఆరుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్, జమ్ము, నవంబర్ 17: జమ్ముకశ్మీర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు లష్కరే తాయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. కుల్గాం జిల్లాలో గురువారం రాత్రి నుంచి జరిగిన 18 గంటల ఎదురుకాల్పుల్లో ఐదుగురు, రాజౌరి జిల్లాలో ఒక ఉగ్రవాది మరణించినట్టు కశ్మీర్ జోన్ ఐజీపీ వీకే బిర్డీ తెలిపారు. కుల్గాం ఘటనలో మృతదేహాలను డ్రోన్‌ల ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు గురువారం కుల్గాంలోని నెహామా గ్రామంలో కార్డన్ సెర్చ్ చేపట్టాయి.

డబుల్ వస్తే.. ట్రబులే!

- బీజేపీ హయాంలో 300% పెరిగిన నిత్యావసరాల ధరలు
- పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపే ప్రధాన కారణం
- డీజిల్ ధర పెంపుతో సాగు పెట్టుబడి, రవాణా వ్యవస్థపై భారం
- ఫలితంగా పాలు, పప్పు, ఉల్లి, ఉప్పు .. ఇలా అన్నీ పైపైకి

మోదీ సర్కారు పాలనలో సామాన్యుడికి వస్తులు ఉండే దుస్థితి దాపురించింది. గ్యాస్‌ధరలు తాళలేక పేదలు కట్టెల పొయ్యికి మళ్లారు. పెట్రోల్, డీజిల్ ధరలను భరించలేక చిన్న ఉద్యోగులు బస్సులు, లోకల్ ట్రైన్స్ బాటపట్టారు. అయితే, కడుపు నింపుకొనేందుకు మరో ప్రత్యామ్నాయం ఉండదు కదా. దీంతో పొదుపు భాతాల్లోని సొమ్మును తీసి, పిరమైనప్పటికీ నిత్యావసరాలను కొంటున్నారు. డబుల్ ఇంజిన్ అంటున్న బీజేపీకి ఓటేస్తే ట్రబుల్స్ భాయమని తెలంగాణవాదులు అంటున్నారు.



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ సర్కారు అసమర్థ విధానాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భరాఘాతం కునుకులేకుండా చేస్తున్నది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో దేశంలోని ప్రజలు అల్లాడుతుంటే.. పెరిగిన నిత్యావసరాల ధరలు అదనపు భారంగా మారాయి. పాలు, కూరగాయలు, బియ్యం, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, ఆలుగడ్డ, చింతపండు ఇలా ప్రతీదాని ధర ఆకాశాన్నంటుతున్నది. మొన్నటికి మొన్న టమోటా ధరలు గుండెల్లో గుబేలుపుట్టించగా, నిన్నటివరకూ ఉల్లి కన్నీళ్లు పెట్టించింది. కేంద్రం చమురు రేట్లను పెంచితే, దాని దెబ్బ వ్యవసాయ పెట్టుబడిపై, రవాణా వ్యవస్థపై పడ్డది. ఆ ప్రభావం నరుకుల మీద పడ్డది. అంతిమంగా సామాన్యుడికే చేటు తీసుకొస్తున్నది.

ఎక్సైజ్ పన్నుపోటు

2014లో ప్రధానిగా మోదీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు గరిష్ఠంగా సుమారు 300 శాతం పెరిగినట్టు లోకల్ సర్కిల్స్ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. సాగుకు అవసరమైన ఉత్పాదక ఖర్చులు, డీజిల్ ధర పెంపుతో రవాణా చార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెరుగడంతో ఆ ప్రభావం నిత్యావసర సరుకులపై పడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. బీజేపీ సర్కారు పాలనలో డీజిల్‌పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం ఎక్సైజ్ పన్నులను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) నివేదిక వెల్లడించింది.

ఇంధనం	2014	2023	పెరుగుదల
పెట్రోల్	రూ. 71	రూ. 109	54%
డీజిల్	రూ. 55	రూ. 97	77%
వంటగ్యాస్	రూ. 399	రూ. 980 (ఇతర చార్జీలుకలిపి)	146%

నిత్యావసరాలు (కిలో)	2014	2023	పెరుగుదల
బియ్యం	రూ. 27	రూ. 63	133%
పల్లి నూనె	రూ. 83	రూ. 155	86%
ఉల్లిగడ్డ	రూ. 10	రూ. 40	300%
గోధుమపిండి	రూ. 22	రూ. 62	182%
టమాట	రూ. 10	రూ. 30	200%
ఉప్ప	రూ. 10	రూ. 22	120%
చక్కెర	రూ. 24	రూ. 48	100%
పాలు (లీటర్)	రూ. 38	రూ. 64	69%
ఆలుగడ్డలు	రూ. 18	రూ. 35	95%
చాయ్‌పత్తా	రూ. 194	రూ. 320	65%
చింతపండు	రూ. 40	రూ. 150	275%

పప్పు దినుసులు(కిలో)	2014	2023	పెరుగుదల
కందిపప్పు	రూ. 50	రూ. 180	260%
మినప్పప్పు	రూ. 32	రూ. 110	244%
శనగపప్పు	రూ. 24	రూ. 75	213%

దజను	2014	2023	పెరుగుదల
అరటిపండ్లు	33	60	82%
గుడ్లు	38	70	84%

ముగ్గురు సభ్యులు ఉన్న కుటుంబం భోజనం ఖర్చు

సంవత్సరం	వారానికి	రోజుకు	ప్లేటుకు	పెరుగుదల
2014	1,008	144	48	-
2023	1,800	257	86	79%

జీతాలు లేక 'చీకటి దీపావళి'

- ఎనిమిది నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు
- మహారాష్ట్రలో వందల మంది పాలిటెక్నిక్ అధ్యాపకుల దీనావస్థ

లాతూర్, నవంబర్ 17: విద్యార్థుల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగించే అధ్యాపకులు ఈ ఏడాది మహారాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం కారణంగా 'చీకటి దీపావళి' జరుపుకోవాల్సి వచ్చింది. మహారాష్ట్రలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వందలాది విజిటింగ్ లెక్చరర్లకు 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. 11 నెలల ఒప్పంద ప్రతిపాదికన నియమితులైన తమకు జీతాలు రాకపోవడంతో బలవంతంగా చీకటి దీపావళి జరుపుకోవాల్సి వచ్చిందని లాతూర్‌లోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఒకరు వాపోయారు. 'మేము ఈఎంఐలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు లాంటివి చెల్లించాలి. కానీ మాకెలాంటి సాయం లభించడం లేదు' అని సుధీర్ సులంకే అనే లెక్చరర్ తెలిపారు. దీనిపై సాంకేతిక విద్య జాయింట్ డైరెక్టర్ ఉమేశ్ నగ్దెవె స్పందిస్తూ సంబంధిత కళాశాలలు జీతాల కోసం ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించారు. విజిటింగ్ లెక్చరర్లకు జీతాలిచ్చే కాలేజీల పర్సనల్ లెడ్జర్ అకౌంట్‌లో నిధులు తక్కువగా ఉండటమే జీతాలు చెల్లించకపోవడానికి కారణమని ఓ కళాశాల ప్రిన్సిపల్ వెల్లడించారు.

కరువు గ్రామాలుగా ప్రకటించకుంటే ఆమరణ దీక్ష

బీఆర్ఎస్ పశ్చిమ మహారాష్ట్ర సమన్వయకర్త హెచ్చరిక

ముంబై, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): నాసిక్ జిల్లా నందగావ్ తాలుకాలోని నాయ్‌డొంగరి, బార్బీ, బాణ్‌గావ్ తదితర గ్రామాలను కరువు గ్రామాలుగా ప్రకటించాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఆ పార్టీ పశ్చిమ మహారాష్ట్ర సమన్వయకర్త నానాసాహెబ్ బచ్చావ్ నందగావ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అప్పాసాహెబ్ బచ్చావ్, ప్రకాష్ వాగ్మారే, గరుడ్ సాహెబ్, మన్సూరి సాహెబ్, అహిరే, బాలాసాహెబ్ బచ్చావ్, ఏక్‌నాథ్, అజయ్ బచ్చావ్ పాల్గొన్నారు.

మరాఠా కోటా కోసం విద్యార్థిని ఆత్మహత్య

ముంబై, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'మరాఠా సమాజానికి తొందరగా రిజర్వేషన్ ఇవ్వండి.. నా బలిదానం వ్యర్థం కాకుండా చూడండి' అని కోరుతూ తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాందేడ్ జిల్లా సోమేశ్వర్‌కు చెందిన కోమల్ బోకరే (14) గురువారం ఉరేసుకోగా తల్లిదండ్రులు ఆమెను తొలుత దగ్గర్లోని దవాఖానకు, అనంతరం నాందేడ్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాలిక చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మరణించింది. కోమల్ తండ్రి రైతు కూలీ కాగా, ఐదుగురు ఆడపిల్లల్లో ఆమె రెండోవారు. మరాఠా రిజర్వేషన్ కోసం గ్రామంలో రిలే నిరాహార దీక్షలు జరగ్గా, కోమల్ అందులో పాల్గొన్నట్టు గ్రామస్థులు తెలిపారు.

డీప్‌ఫేక్ బాధితుల జాబితాలో మోదీ

ఏఐ దుర్వినియోగంపై ప్రధాని ఆందోళన

న్యూఢిల్లీ, నవంబర్ 17: డీప్‌ఫేక్ వీడియోల బాధితుల జాబితాలో ప్రధాని మోదీ చేరారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. కృత్రిమ మేధ(ఏఐ)ను ఈ విధంగా దుర్వినియోగం చేయడం తీవ్ర ఆందోళనకరమన్నారు. బీజేపీ దీపావళి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేసే ఇలాంటి వీడియోలను గుర్తించి వాటికి అడ్డుకట్ట వేయాలని చాట్‌జీపీటీని కోరినట్టు తెలిపారు. 'నేను గార్బా నృత్యం చేస్తున్నట్టున్న వీడియో ఒకటి చూశాను. నేను బడిలో చదువుకుంటున్నప్పటి నుంచి ఇప్పటి వరకు గార్బా ఆడలేదు' అని మోదీ తెలిపారు. ఇలాంటి వీడియోలు అనేకం ఉన్నాయని, వీటి మీద ప్రజలను చైతన్యవంతం చేయాలని మీడియాకు విజ్ఞప్తి చేశారు. నటీమణులు రష్మిక, కత్రినా, కాజోల్ డీప్‌ఫేక్ వీడియోలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన సంగతి తెలిసిందే.

నుహ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

నుహ్: బీజేపీ పాలిత హర్యానాలోని నుహ్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలోని ఓ మసీదు సమీపంలో గుర్తుతెలియని దుండగులు రాళ్లు విసిరిన ఘటనలో ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకొన్నదని పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంతమంది మహిళలు ఓ బావి వద్ద పూజలు చేసుకొనేందుకు వెళ్తున్నారు. వారు మసీదు సమీపానికి వచ్చేసరికి, వారిపై దుండగులు రాళ్లు రువ్వారు. స్థానిక మదరసాకు చెందిన పిల్లలే ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఫిర్యాదు వచ్చిందని నుహ్ జిల్లా ఎస్పీ నరేందర్ బిజార్నియా పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలను అదుపులోకి తీసుకొన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఏడాది జూలై 31న నుహ్‌లో వీహెచ్‌పీ ర్యాలీ సందర్భంగా చోటుచేసుకొన్న ఘర్షణల్లో ఆరుగురు మరణించిన విషయం తెలిసిందే.

- గెలుపు కోసం చెప్ప దెబ్బలు

ఎన్నికల్లో పోటీచేసే కొందరు అభ్యర్థులు స్వామీజీలు, బాబాల ఆశీర్వాదం తీసుకుంటారు. కానీ మధ్యప్రదేశ్‌లో ఓ కాంగ్రెస్ అభ్యర్థి మాత్రం బాబాగా పేర్కొనే ఓ బిచ్చగాడితో అడిగి మరీ చెప్పుతో కొట్టించుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. రాత్లామ్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పారస్ తన ప్రత్యర్థి జోరు తట్టుకోలేకపోయినట్టున్నారు. ఎవరు చెప్పారో తెలియదు కానీ బాబాగా చెప్పబడే ఓ బిచ్చగాడి దగ్గరికి వెళ్లి తనను చెప్పుతో కొట్టి ఆశీర్వదించాలని వేడుకున్నారు. అడిగిందే తడవుగా ఆ యాచకుడు తన చెప్పు తీసి పారస్‌ను కొట్టడం.. ఆ తర్వాత అతడు తన చెప్పులను పారవేయడం.. పారస్ కొత్త చెప్పులను భక్తిశ్రద్ధలతో బిచ్చగాడికి అందించడం చకచకా జరిగిపోయాయి.

-(స్పెషల్ టాస్క్ బ్యూరో)

మధ్యప్రదేశ్‌లో 76% పోలింగ్

- ఛత్తీస్‌గఢ్ తుది విడతలో 74%
- ముగిసిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు
- పలు చోట్ల ఘర్షణలు.. పలువురికి గాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ దాడిలో జవాన్ మృతి

శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు

నియోజకవర్గంలో ఎన్నికల సిబ్బంది అంతా మహిళలే

ఎన్నికల నిర్వహణలో అతివలు సత్తా చాటారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌లలో పూర్తిగా మహిళా బృందాలే విధులు నిర్వహించిన ఘటన దేశ ఎన్నికల చరిత్రలోనే తొలిసారిగా ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకుంది. ఆ రాష్ట్రంలో శుక్రవారం జరిగిన రెండో, ఆఖరి విడత పోలింగ్‌లో రాయ్‌పూర్ (నార్త్) నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన 201 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల విధులన్నీ మహిళలే నిర్వహించారు. పురుషుల ప్రమేయం లేకుండా, అన్ని విభాగాలలో మహిళలే విధులు నిర్వహించారు. ఇది దేశంలోనే తొలిసారని ఎన్నికల సంఘం ప్రకటించింది.

న్యూఢిల్లీ/భోపాల్/రాయ్‌పూర్, నవంబర్ 17: మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు పలు చోట్ల ఘర్షణలు, ఉద్రిక్తతల మధ్య ముగిశాయి. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతగా, ఛత్తీస్‌గఢ్‌లో 70 స్థానాలకు రెండో(తుది) విడత ఎన్నికల పోలింగ్ శుక్రవారం జరిగింది. కడపటి వార్తలు అందే సమయానికి మధ్యప్రదేశ్‌లో 76.22 శాతం, ఛత్తీస్‌గఢ్‌లో 74 శాతం ఓటింగ్ నమోదైంది. సంబంధిత పత్రాల పరిశీలన తర్వాత కచ్చితమైన ఓటింగ్ శాతం శనివారం వెల్లడవుతుందని అధికారులు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌నగర్ నియోజకవర్గంలో రెండు గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో కాంగ్రెస్ అభ్యర్థి అనుచరుడు ఒకరు మరణించారు. ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఒక కేంద్రంలో పోలింగ్ అనంతరం సిబ్బంది తిరిగి వెళ్తుండగా నక్సలైట్లు పేలుడు జరిపారు. ఈ ఘటనలో సిబ్బందికి ఎస్కార్ట్‌గా ఉన్న ఐటీబీపీ జవాన్ మృతిచెందారు.

మధ్యప్రదేశ్‌లోని పలు చోట్ల ఘర్షణలు

మధ్యప్రదేశ్‌లోని ఛతార్‌పూర్ జిల్లా రాజ్‌నగర్‌లో రెండు పార్టీల గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. శుక్రవారం ఉదయం జరిగిన ఈ ఘర్షణల్లో కాంగ్రెస్ అభ్యర్థి విక్రమ్ సింగ్ అనుచరుడు ఒకరు మరణించాడని జిల్లా ఎస్పీ అమిత్ సంఘి వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ఇతర చోట్ల కూడా ఘర్షణలు చోటుచేసుకొన్నాయి. ఇండోర్ జిల్లా మహూ ఏరియాలో రెండు గ్రూపుల మధ్య వాగ్వివాదంలో ఐదుగురు గాయపడ్డారు. మోరేనా జిల్లా దిమాని నియోజకవర్గం లోని ఓ గ్రామంలో ఓటేసేందుకు వెళ్తున్న వారిని కొంత మంది అడ్డుకోవడంతో జరిగిన ఘర్షణల్లో ఇద్దరికి గాయాలయ్యాయి.

పోలింగ్ సిబ్బందికి ఎస్కార్ట్‌గా వెళ్తుండగా..

ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో మణిపూర్ పోలీస్టేషన్ పరిధిలో నక్సల్స్ జరిపిన పేలుళ్లలో ఐటీబీపీ జవాన్ మరణించారు. పోలింగ్ అనంతరం సిబ్బందికి ఐటీబీపీ హెడ్ కానిస్టేబుల్ జోగిందర్ శర్మ ఎస్కార్ట్‌గా వెళ్తున్నారు. ఈ క్రమంలో బడే గోబ్రా గ్రామం సమీపంలో నక్సల్స్ పేలుడు జరిపారని పోలీసులు వెల్లడించారు.

నేనూ సీఎం అభ్యర్థినే..!

అధిష్ఠానం మదిలో నా పేరు ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ నేత సింగ్‌దేవ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): 'ఆలి లేదు, చూలు లేదు కానీ కొడుకు పేరు..' అన్నట్టుగా ఉన్నది ఛత్తీస్‌గఢ్‌లోని హస్తం పార్టీ నేతల తీరు. రాష్ట్రంలో ఓవైపు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతుండగానే... ఫలితాలు వచ్చినట్టు, గెలిచేసినట్టు కాంగ్రెస్ నేతలు అప్పుడే సీఎం సీటు నాదంటే నాదని కొట్టుకొంటున్నారు. డిప్యూటీ సీఎం, అంబికాపూర్ అభ్యర్థి టీఎస్ సింగ్ దేవ్ శుక్రవారం జరిగిన అసెంబ్లీ రెండో విడత ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకొన్న తర్వాత మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే.. పార్టీ అధిష్ఠానంలో, తనను సమర్థించే నేతల మదిలో తదుపరి సీఎంగా తన పేరు ఉన్నదని పేర్కొన్నారు. తాను కూడా సీఎం పదవిని ఆశిస్తున్నట్టు, సీఎం రేసులో ఉన్నట్టు సింగ్ దేవ్ ఈ సందర్భంగా మనసులోని మాట బయటపెట్టారు. ఈ సందర్భంగా సీఎం భూపేశ్ బఘేల్‌ను ఉద్దేశించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలకు సీఎం బఘేల్ కెప్టెన్ అయినప్పటికీ, సమిష్టి నాయకత్వంతో కాంగ్రెస్ ఎన్నికలకు వెళ్లిందని అన్నారు.

ముంబై రియల్టీ అదానీకి సమర్పయామి!

- ధారావి ప్రాజెక్టు రూల్స్ మారుస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్
- ముంబై రియల్టీ డెవలపర్లు ధారావి టీడీఆర్‌లను తప్పక కొనాల్సిందే
- టీడీఆర్‌ను అదానీ అధిక ధరకు అమ్ముకునే అవకాశం
- పన్ను ప్రయోజనాల్ని కల్పించేలా రైట్స్ ఉపయోగించుకునే ఛాన్స్

ముంబై: ముంబైలోని ప్రఖ్యాత ధారావి స్లమ్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు బిడ్డింగ్ నిబంధనల్ని మార్చి ఇప్పటికే ప్రధాని సన్నిహిత మిత్రుడిగా పేరొందిన గౌతమ్ అదానీకి అప్పగించిన బీజేపీ నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం తాజాగా మొత్తం ముంబై రియాల్టీనే అదానీ పాదాక్రాంతం చేసింది. ఇందు కోసం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వం ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు (డీఆర్‌పీ) సంబంధించిన డెవలప్‌మెంట్ కంట్రోల్ రూల్స్‌లో కొన్నింటిని హఠాత్తుగా మారుస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. కొత్త రూల్స్‌తో ఈ ప్రాజెక్టును అమలు చేయడానికి అదానీ గ్రూప్ ఇబ్బడిముబ్బడిగా నిధుల్ని ఇతర ముంబై రియల్టీ డెవలపర్ల నుంచి సునాయాసంగా సమకూర్చుకుంటుంది. అంతేకాకుండా భారీ పన్ను ప్రయోజనాలు కలిగేలా ఇండెక్సేషన్ లేకుండానే ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్‌లు) ఉపయోగించుకునే అవకాశాన్ని సైతం అదానీ గ్రూప్ అందుకుంది.

40 శాతం టీడీఆర్‌లను అదానీ నుంచే కొనాలి

ధారావి రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు ప్రతిపాదిత వ్యయం రూ. 23,000 కోట్లు. ఈ ప్రాజెక్టును బిడ్డింగ్‌లో గెలుచుకున్న అదానీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌దే 80 శాతం మెజారిటీ వాటా. డీఆర్‌పీనీ రూ. 5,069 కోట్లకు బిడ్డింగ్‌లో పొందిన అదానీ గ్రూప్ తొలుత రూ. 1,000 కోట్ల వరకూ పెట్టుబడి చేసింది. తన గ్రూప్ కంపెనీల్లో కొంత వాటాను విక్రయించి, మిగిలిన మొత్తాన్ని ఇచ్చే పనిలో ఉంది. ఇక ప్రాజెక్టు పూర్తి చేయడానికి భారీ పెట్టుబడులు అవసరం అవుతాయి. అదానీ కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన తాజా నోటిఫికేషన్ ప్రకారం ముంబైలోని రియల్టీ డెవలపర్లు వారికి అవసరమైన టీడీఆర్‌ల్లో తొలి 40 శాతం రైట్స్‌ను ధారావి ప్రాజెక్టు నుంచే తప్పనిసరిగా కొనాలి. అంటే స్లమ్ ప్రాజెక్టు నుంచి తీసుకున్న టీడీఆర్‌ను అత్యంత ఖరీదైన రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో కూడా వాడుకుని, అదనపు స్పేస్‌లో కన్‌స్ట్రక్షన్ చేసుకోవచ్చు.

ప్లాట్ విలువలో 90 శాతం ధరతో టీడీఆర్ అమ్ముకోవచ్చు

అదానీకి అడ్డగోలు ప్రయోజనం కల్పించే మరో నిబంధన ప్రకారం ధారావి టీడీఆర్‌ను ప్లాట్ విలువలో 90 శాతం వరకూ ధరను నిర్ణయించి అమ్ముకునే వీలు కలుగుతుంది. సాధారణంగా టీడీఆర్‌లు డెవలప్‌మెంట్ ప్లాట్ ధరలో 30-60 శాతం మేర ఉంటాయి. ముంబైలో ఎక్కడా లేనంతగా 90 శాతం ధరకు విక్రయించే అనుమతినివ్వడంతో ధారావి టీడీఆర్ అత్యంత ఖరీదైనదని రియల్ ఎస్టేట్ రంగం నిపుణులు చెపుతున్నారు.

అదానీ నుంచి ఎంత కొంటే అంత..

టీడీఆర్‌లు ఆశ చూపించి అదానీ చుట్టూ తిరిగే పరిస్థితికి ముంబై బిల్డర్లను తాజా నిబంధనలు తీసుకొచ్చాయి. వాస్తవానికి ఒక చౌక ప్రాజెక్టు నుంచి 1,000 చదరపు అడుగుల టీడీఆర్‌ను కొంటే ఖరీదైన ప్రాంతాల్లో కేవలం 100 చదరపు అడుగుల అదనపు నిర్మాణానికే అనుమతిస్తారు. కానీ సవరించిన నిబంధనల ప్రకారం ధారావి టీడీఆర్‌ను ఎంత స్పేస్‌కు తీసుకుంటే అంతే స్పేస్‌ను దక్షిణ ముంబైలాంటి పోష్ ఏరియాల్లో వాడుకునే అవకాశాన్ని కల్పించారు.

చంద్రయాన్-4కి ఇస్రో సన్నద్ధం!

పుణే, నవంబర్ 17: చంద్రయాన్-3 విజయవంతమైన నేపథ్యంలో మరో రెండు లూనార్ మిషన్లకు ఇస్రో సిద్ధమవుతున్నది. లూపెక్స్, చంద్రయాన్-4 ప్రాజెక్టుల ద్వారా 350 కేజీల ల్యాండర్‌ను చంద్రుడి 90 డిగ్రీల (ప్రాంతంలో(చీకటి వైపు) ల్యాండ్ చేయడానిక